
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 3
శుక్రవారం 10 జనవరి 2025





నిరీక్షణ...!

- కరెంటు కనెక్షన్ల కోసం రైతుల కష్టాలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,950 దరఖాస్తులు పెండింగ్
- ఎమ్మిగనూరు 220 కేవీ సబ్ స్టేషన్‌కు మోక్షం లభించేనా..?
- ప్రతిపాదనల్లోనే సబ్ స్టేషన్ల నిర్మాణం
- లో ఓల్టేజీ సమస్యలతో అన్నదాతల అవస్థలు
- నేడు విద్యుత్ నియంత్రణ మండలి అధికారుల ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు ఎన్నో నెలలుగా నిరీక్షిస్తున్నారు. డిపాజిట్ చెల్లించినా కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం లేదు. 2023 సెప్టెంబరు నుంచి డిపాజిట్ చెల్లించిన రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి బోరుబావులు తవ్వుకున్న అన్నదాతలు కరెంటు లేకపోవడంతో అప్పులపాలవుతున్నారు. అదే క్రమంలో విద్యుత్ వినియోగం, కనెక్షన్లు పెరుగుతున్నా.. అవసరమైన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టడం లేదు. ఫలితంగా లో ఓల్టేజీ సమస్యతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నివారణకు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 37 దాకా 33/11 కేవీ సబ్ స్టేషన్లు నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద నిర్మించాల్సిన 220 కేవీ సబ్ స్టేషన్‌కు మోక్షం ఎప్పుడని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురించినా.. పెండింగ్ దరఖాస్తులు మాత్రం కదలడం లేదు. నేడు 2025-26 విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ కోసం కర్నూలుకు వస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ), దక్షిణ మండల విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఎస్‌పీడీసీఎల్) ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ విద్యుత్ శాఖ డివిజన్లు ఉన్నాయి. వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు 15 లక్షలకు పైగానే ఉన్నాయి. వ్యవసాయ వినియోగ విద్యుత్ కనెక్షన్లు కర్నూలు జిల్లాలో 1.10 లక్షలు, నంద్యాల జిల్లాలో 1.05 లక్షలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 20 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. రెండు జిల్లాల్లో జనాభాతో పాటు నివాసాలు, వ్యాపారాలు పెరగడం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కూడా పెరుగుతున్నాయి. దీంతో వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే క్రమంలో సాగుపై మక్కువతో రూ.లక్షలు ఖర్చు చేసి బోరుబావులు చేపట్టారు. రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా డిపాజిట్ చెల్లించిన రైతులు కరెంట్ కనెక్షన్ కోసం ఏడాదిన్నరగా నిరీక్షిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో కష్టాలు తీరుతాయని రైతులు ఆశిస్తే.. ఆ దిశగా చర్యలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

- కర్నూలు జిల్లాలో 7,500, నంద్యాల జిల్లాలో 4,450 మంది రైతులు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. ఒక్కో రైతు ఎంత తక్కువ కాదన్నా రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా డిపాజిట్ చేశారు. మెజార్టీ రైతులు వందరూపాయలకు రూ.2 వడ్డీతో అప్పు చేసినవారే ఉన్నారు. 2023 సెప్టెంబరు నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త కనెక్షన్లతో పాటు అవసరమైన విద్యుత్ పరికరాలు మంజూరు చేయాలి.
- విద్యుత్ లో ఓల్టేజీ సమస్య నివారణకు కర్నూలు జిల్లాలో 22, నంద్యాల జిల్లాలో 15 వరకు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం ఎస్‌పీడీసీఎల్‌కు స్థానిక విద్యుత్ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి సరాసరి రూ.3 కోట్లు చొప్పున 37 సబ్ స్టేషన్లకు రూ.111 కోట్లు నిధులు మంజూరు చేయాలి.
- ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాలకు అనంతపురం జిల్లా గుత్తి 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వేసవిలో విద్యుత్ కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి 50 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. రూ.120 కోట్లతో ఈ సబ్ స్టేషన్ నిర్మిస్తే.. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పల్లెసీమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయవచ్చు.
- ఉమ్మడి జిల్లాలో ఏడీఈఈలు నాలుగురు, ఏఈఈలు 32 మంది కొరత ఉంది. ఈ ఖాళీలు భర్తీ చేయాలి.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు నగర శివారులో ఉన్న దిన్నెదేవరపాడు దగ్గర ఉన్న విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగంపై 2025-26 టారిఫ్ ఖరారు కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఆ కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రాంసింగ్, ఫైనాన్స్ సభ్యుడు రామకృష్ణ, విద్యుత్ పంపిణీ వ్యవస్థల విజయవాడ, విశాఖ, తిరుపతి సీఎండీలు పటాన్‌శెట్టి రవికుమార్, పృథ్వితేజ్, కె.సంతోశ్‌రావు, ట్రాన్స్‌కో సీఎండీ, జేఎండీ సహా డైరెక్టర్లు పాల్గొంటారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుంది. 2 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్, 3 నుంచి 4 గంటల వరకు ప్రజల అభిప్రాయాలు, సలహాలు, సూచనలపై సీఎండీల వివరణ ఉంటుంది. ప్రజల నుంచి లిఖిత పూర్వకంగా లేదా నేరుగా చెప్పే అభిప్రాయాలను స్వీకరిస్తారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు.



సర్వ పాపహరణం
ఉత్తర ద్వార దర్శనం

- నేడు వైకుంఠ ఏకాదశి
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన వైష్ణవ ఆలయాలు



గోదా గోకులంలో శ్రీరంగనాథస్వామి

కర్నూలు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి రోజుకు ఒక ప్రత్యేకత ఉంది. ఆ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పేర్కొంటారు. ఆరోజున శ్రీ మహా విష్ణువు వైకుంఠంలో ఉత్తరం వైపు ఉన్న ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి కోర్కెలు తీరుస్తాడని హిందూ పురాణాలు పేర్కొంటాయి. ఈ నేపథ్యంలో వైష్ణవ భక్తులు పరమ పవిత్రమైన వేడుకగా 'వైకుంఠ ఏకాదశి'ని నిర్వహిస్తారు. ఈ వేడుక సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వైష్ణవ దేవాలయాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు స్వామివారిని ఉత్తర 'ద్వారం' ద్వారా భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు. ఏటా ఒకరోజు వచ్చే వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలను ప్రత్యేక అలంకారాలతో తీర్చిదిద్దారు. ఉత్తర ద్వారం వద్ద ద్వారాలను పుష్పాలతో తీర్చిదిద్దారు. విష్ణు పురాణాన్ని అనుసరించి వైకుంఠ ఏకాదశి ఒక్క రోజున ఉపవాసం ఉంటే ఏడాది పొడవునా వచ్చే 24 ఏకాదశులలో ఉపవాసం ఉన్నంత పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే వైకుంఠ ఏకాదశి రోజున వైష్ణవభక్తులు ఉపవాసాలు, జాగరణకు ప్రాధాన్యమిస్తారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నగరంలోని వైష్ణవ దేవాలయల్లో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా ఆలయ ప్రవేశానికి బారికేట్లు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారు మామిదాలపాడుతోని గోదా గోకుల క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉత్తర ద్వారం దర్శనం, ప్రత్యేక పూజాదికార్యక్రమాలు చేపట్టినట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు. కర్నూలు నగరంలోని పేట శ్రీరామాలయం, వెంకట రమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పాత నగరంలోని రామాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, రంగరాజ వీధిలోని వేంకటేశ్వర, రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సైతం బందోబస్తు నిర్వహణకు సిద్ధమయ్యారు.



వెంకటరమణ కాలనీలోని
శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విద్యుద్దీపాల అలంకరణ

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు



కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ శామ్యూల్ పాల్ గురువారం తెలిపారు. పండుగ అనంతరం పాఠశాలలు 20వ తేదీన పునఃప్రారంభమవుతాయన్నారు. అయితే మిషనరీ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ప్రకటించినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో 16వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభ మవుతా యన్నారు. సంక్రాంతి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటూ అసైన్‌మెంట్ నిర్వహించడం, సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేసి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యత

జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి



మాట్లాడుతున్న జి.నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు డీపీఆర్‌సీలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన సీఈఓ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ఆస్తులు వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పారిశుధ్యం విషయంలో నిబంధనల మేరకు నిధులు వెచ్చించి గ్రామాల్లో కనీస సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజుల వాణి, ఎంఓటీలు శ్రీనివాసులు, రఘునాథ్, రవికిశోర్, నగేష్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లకు నిధులు మంజూరు

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల పరిషత్‌లకు సంబంధించి పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 53 మండల ప్రజా పరిషత్‌లకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. తలసరి గ్రాంటు రూ.1,52,35,944, సీనరేజీ గ్రాంటు రూ.3,93,44,687, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.2,25,95,586 విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని మండల ప్రజాపరిషత్‌కు నిధులు జమచేశారన్నారు. ఎంపీడీఓలు ప్రభుత్వ నిబంధనల మేరకు నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆదేశించారు.

20 నుంచి రీసర్వే ప్రారంభం

- 25 పైలట్ గ్రామాల ఎంపిక
- 200 నుంచి 250 ఎకరాల బ్లాక్‌లుగా గ్రామం విభజన
- జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య



కర్నూలు కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 20 నుంచి ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద సర్వే కార్యక్రమం ప్రారంభం కానుందని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద రీసర్వే గురించి జిల్లాలోని ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లకు డిప్యూటీ తహసీల్దార్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కింద జిల్లాలోని 25 మండలాల్లో 25 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వేను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవోల ఆధ్వర్యంలో రీసర్వేపై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులుతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20వ తేదీ నుంచి నిర్వహించే రీసర్వేకు ముందుగా ప్రతి రైతుకు నోటీసు జారీ చేయాలన్నారు. గ్రామాన్ని 200 నుంచి 250 ఎకరాల బ్లాకులుగా విభజించాలన్నారు. ప్రతి గ్రామానికి అవసరాన్ని బట్టి 3 నుంచి 4 బృందాలను కేటాయించాలని, ప్రతి బృందంలో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, ఒక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఒక విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ ఉండాలని, పై బృందాలతో పాటు ఆ గ్రామంలో పని చేస్తున్న ఒక విలేజ్ సర్వేయర్ ఒక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌తో ప్రతి గ్రామానికి ప్రత్యేకంగా కమ్యూనికేషన్ ప్రయోజనం కోసం ఒక ప్రత్యేక బృందాన్ని నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే అధికారి మునికన్నన్, ఆర్ఎస్‌డీటీ, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇజితెమా

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించిన ఉలేమాలు
- సామూహిక దువా అనంతరం ముగిసిన వేడుక



4

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు



మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా రూ.3,39,61,457 నగదు రాబడిగా లభించింది. ఈ హుండీ ఆదాయాన్ని భక్తులు గత 23 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 139.2 గ్రాముల బంగారు, 5.4 కిలోల వెండి లభించాయి. అదేవిధంగా 481 యుఎస్ఏ డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 140 యూఏఈ దిర్హమ్స్, 35 కెనడా డాలర్లు, 2000 ఉగండా షర్లింగ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపును నిర్వహించారు. ఈ లెక్కింపులో ఆలయ అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

బంగారు అక్రమ రవాణా

- గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ అధికారులు
- కేరళ నుంచి ఆదోనికి 13 కిలోలు రైలులో తరలింపు
- పట్టుబడిన బంగారం విలువ రూ.10 కోట్ల పైమాటే

కర్నూలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణాపై సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులు పక్కా నిఘా పెట్టారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి తరలిస్తుండగా పక్కా సమాచారంతో కస్టమ్స్ అధికారులు దాడులు చేశారు. వ్యాపార, వాణిజ్య రంగంలో రెండో ముంబాయిగా పేరుగాంచిన ఆదోని బంగారు వ్యాపారంలోనూ ప్రసిద్ధి. మెజార్టీగా జీరో వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే ఆదోనికి చెందిన 12 మంది బంగారు వ్యాపారులు 13 కిలోల 24 క్యారెట్ల బంగారు బిస్కెట్లు (గోల్డ్ బార్) కేరళ రాష్ట్రం ఎర్నాకుళం పట్టణంలో కొనుగోలు చేశారు. బంగారంతో కన్యాకుమారి-పూణే ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎక్కారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా ఆదోని వ్యాపారులు బంగారం రైలులో తీసుకెళ్తున్నారని సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులకు పక్కాగా సమాచారం వచ్చింది. ఆ శాఖ సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది దాడులు చేశారు. రైలులో బోగిబోగిని క్షుణంగా తనిఖీ చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో గురువారం బంగారం అక్రమ రవాణా చేస్తున్న ఆదోని వ్యాపారులను పట్టుకొని వారి నుంచి దాదాపు 13 కిలోలు అసలైన బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన బంగారం విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. బంగారం, రవాణా చేస్తున్న వ్యాపారులను అనంతపురం జిల్లా తాడిపత్రిలోని కస్టమ్స్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. అనంతరం పోలీస్ బందోబస్తుతో బంగారం, వ్యాపారులను విజయవాడకు తరలించారు. ఈ విషయం ఆదోనిలో ప్రధాన చర్చగా మారింది. రాయలసీమ జిల్లాల్లో బంగారు వ్యాపారంలో ప్రొద్దుటూరు తరువాత ఆదోని పట్టణానికి ఎంతో పేరు ఉంది.



అదే స్థాయిలో జీరో వ్యాపారం, బంగారు అక్రమ రవాణా కూడా చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. గతంలో బంగారం అక్రమ రవాణాలో ఇద్దరు పోలీసులు కూడా సస్పెండ్ అయిన సంఘటనలు ఉన్నాయి. కాగా.. సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బంగరంలో కొంత భాగం బంగారానికి బిల్లులు ఉన్నాయని ఆదోని వ్యాపారి ఒకరు పేర్కొనడం కొసమెరుపు.



కరువు నేలపై సూర్యకాంతి

కరువునేలపై సూర్యకాంతి ప్రసరించనుంది. పత్తికొండ మండలం హోసూరు - పెద్దహుల్తి గ్రామాల నడుమ 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 కింద చేపట్టనున్న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం టాటా పవర్ రిమ్యునబుల్ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీకి కేటాయించింది. ఈ మేరకు రెండు రోజుల కింద జీవోను విడుదల చేసింది. 1800 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా 1400 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

- హోసూరు - పెద్దహుల్తి గ్రామాల మధ్య సోలార్ ప్లాంట్
- 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- పనులు ప్రారంభించనున్న టాటా పవర్
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు

పత్తికొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 రూపొందించి 2024 అక్టోబరు 10న జీవోనెం 37ను విడుదల చేసింది. ఈ పాలసీ ద్వారా కంపెనీలకు పెట్టుబడులను అహ్వానిస్తూ 2024 డిసెంబరు 30న స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపిబి) సమావేశం నిర్వహించి కంపెనీలను పెట్టుబడులకు ఆహ్వానించింది. కర్నూలు జిల్లా హోసూరు - పెద్దహుల్తి మధ్య 400 మెగావాట్ల విద్యుత్ లక్ష్యంగా ప్రభువ్వం ఏర్పాటు చేయదలచుకున్న సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు టాటా పవర్ రిమ్యునబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టిపిఆర్ఈఎల్) ముందుకు వచ్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మేరకు ప్రభుత్వం టాటా ఎనర్జీ కంపెనీ వాటాదారులతో సంప్రదింపులు జరిపింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 నిబంధనలకు అనుగుణంగా సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు జరగాలని సూచించింది. ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఇప్పటికే ఉన్న విండ్ ఇతర ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగించరాదని నిబంధనల్లో పేర్కొంది. సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా తయారయ్యే సౌర విద్యుత్ వినియోగంపై కూడా నిబంధనలు విధించి ప్రాజెక్టును టాటా ఎనర్జీకి అనుమతులు మంజూరు చేసింది.

30ఏళ్ల లీజుకు భూముల కేటాయింపు..

400 మెగావాట్ల సోలార్ వపర్ ప్రాజెక్టు కోసం 1800 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించనుంది. రెండు గ్రామాల పరిధిలో ఉన్న రెవెన్యూ, ప్రభుత్వ, ప్రైవేటు, పట్టా భూములను 30ఏళ్ల లీజుకు టాటా ఎనర్జీకి కేటాయించనుంది. ఈ భూములకు నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ గుర్తింపును ప్రభుత్వం ఇవ్వనుంది. ఇందు కోసం భూ యజమానులు భూ వినియోగం మార్పు కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. భూ యజమానులు చెల్లించాల్సిన రుసుముపై ప్రభుత్వం మినహాయింపు ప్రకటించింది. 30 ఏళ్లపాటు భూమి వినియోగ హక్కులు టాటా ఎనర్జీ సంస్థకే చెందుతాయి. ఈ తతంగానికి సంబంధించిన అన్ని ఖర్చులను కంపెనీయే భరించాలి. ఎకరాకు ఏడాదికి రూ31,000 లీజు చెల్లించాలని, 2 సంవత్సరాలకు ఒకసారి 5శాతం లీజు ధరను పెంచాలని ప్రభుత్వం నిబంధనల్లో పేర్కొంది. కంపెనీ నిర్మాణదశ నుండి భూ హక్కుదారులకు లీజును కంపెనీ చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024 నిబంధనల మేరకు ఈ సోలార్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 24నెలల్లోపు పూర్తిచేయాలని జీవోలో పేర్కొంది.

స్థానిక యువతకు ఉపాధి

సోలార్ పవర్ ప్రాజెక్టు ద్వారా సుమారు 1400 మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు అందనున్నాయి. వ్యవసాయమే ప్రధాన జీవనాధరమైన పత్తికొండ ప్రాంతంలో యువత ఉద్యోగావకాశాల కోసం సుదూర ప్రాంతాలకు వెళుతుంటారు. స్థానికంగా ఇంతపెద్ద ప్రాజెక్టు నిర్మాణమైతే తమ పిల్లలకు ఇక్కడే ఉపాధి దొరుకుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం



రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అన్ని రకాలుగా వెనుకబడ్డ పత్తికొండ ప్రాంతానికి ప్రాజెక్టులను కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పలుసార్లు కోరాం. రాష్ట్రంలో చేపట్టనున్న భారీ ప్రాజెక్టులలో 400 మెగవాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును సీఎం పత్తికొండ ప్రాంతానికి కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలి.

- కేఈ శ్యాంబాబు, పత్తికొండ ఎమ్మెల్యే



చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవాలి

జిల్లా పర్యాటక శాఖ అధికారి పి. విజయ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, సీనియర్ సిటిజన్లు

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కట్టడాలను ప్రతి ఒక్కరు కాపాడుకునే విధంగా కృషి చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.విజయ అన్నారు. గుత్తి కోట సంరక్షణ సమితి టీం అధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను గురువారం కొండారెడ్డి బురుజు వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గుత్తికోట సంరక్షణ కమిటీ గౌరవ సలహాదారులు సూర్యనారాయణరెడ్డి, చరిత్రకారులు కల్లూకర చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ సంరక్షణ సమితి రూపొందించిన క్యాలెండర్‌లో జిల్లా పర్యాటక ప్రాంతాలు ఉండటం హర్షణీయమన్నారు. కల్లూకర చంద్రశేఖర్ మాట్లాడుతూ చరిత్ర కలిగిన ప్రదేశాలను ఎలా సంరక్షించాలన్న అంశంపై భావితరాలకు తెలియజే యాలన్నారు. గుత్తి కోటకు, కర్నూలు కొండారెడ్డి బురుజుకు ఎన్నో వంద సంవత్సరాల ఘన చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ఇమ్మానుయేల్, ప్రకాష్, వీరశైవ లింగాయత్ ఓబీసీ సాధన సమితి నాయకులు వీరభద్రప్ప, విజయ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సభ విజయవంతం

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే ఈనెల 5న విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం సభ విజయవంతమైందని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేశ్ అన్నారు. గురువారం నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లోగల వినాయక మందిరం సమావేశ హాలు లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటూ ఇతర రాష్ట్రాల్లోని హిందువులంతా తరలిరావడం ఎంతో సంతోషదాయకమని చెప్పారు. బుధవారం తిరుమల ఘటనపై వారు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, అమాయకుల మరణా నికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్, ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

ముస్తాబైన అహోబిలం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో స్వామి వారిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలో స్వయంభువుగా వెలసిన సర్వలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, యర్రగుంట్లలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు గ్రూపు దేవాలయాల ఈఓ బీవీ నరసయ్య తెలిపారు.



ఇజ్‌తెమాలో దువా చేస్తున్న భక్తులు

ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా..!

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించిన ఉలేమాలు
- సామూహిక దువా అనంతరం ముగిసిన వేడుక



తిరుగు ప్రయాణంలో రద్దీ

ఆత్మకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కేంద్రంగా మూడురోజుల పాటు జరిగిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా గురువారం మధ్యాహ్నం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి లక్షలాదిగా హాజరయ్యారు. ఇజితెమాలో జరిగే ఈ దువా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రికే లక్షలాదిగా ఇజితెమా ప్రాంగణానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తర్వాత ముంబై, నిజామొద్దిన్, డిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి వివరించారు. సర్వమానవాళి సమానమేనని అందరి పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఉపదేశించారు. మతాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడుకుందామని ఉద్బోధించారు. ఆ తర్వాత 12.30 గంటల సమయంలో సామూహిక దువాను నిర్వహించిన అనంతరం మధ్యాహ్న నమాజ్‌ను పూర్తి చేసుకుని ఇజితెమా వేడుకలకు ముగింపు పలికారు. ఇదిలా వుంటే చివరి రోజు కూడా ఇజితెమాకు వచ్చిన వారికి నిర్వహణ కమిటీ వారు భారీ ఏర్పాట్లను కల్పించారు. వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపుగదులు, విద్యుత్ సదుపాయం సమకూర్చారు. అదేక్రమంలో 17 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన సౌకర్యవంతమైన భోజన వసతిని కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఇజితెమాకు వచ్చిన వారికి మజ్జిగ, పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. ఇజితెమా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో కొనుగోళ్లు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇజితెమా కార్యక్రమాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కమిటీని అభినందించారు.



ఇజితెమా ప్రాంగణంలో పర్యవేక్షిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

ట్రాఫిక్‌ను పర్యవేక్షించిన ఎస్పీ

గురువారం ఉదయం నుంచే నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఇజితెమా సందర్భంగా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ఇజితెమా అనంతరం తిరుగు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టారు. ఆయా పార్కింగ్ ప్రదేశాల నుంచి నిర్దేశించిన రూట్లలో వాహనాలను మళ్లించారు. నంద్యాల టర్నింగ్ వద్దకు ఆయన చేరుకుని ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. ఇజితెమా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అపశృతులు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ డీ. రాము, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



వజూ చేసుకుంటున్న భక్తులు

సైకిల్ మీద దేశాటన

- సేవ్ నేచర్ సేవ్ లైఫ్ అంటున్న జార్ఖండ్ యువకుడు
- నందికొట్కూరుకు చేరుకున్న సైకిల్ యాత్ర



నందికొట్కూరులో జార్ఖండ్ యువకుడి సైకిల్ యాత్ర

నంది కొట్కూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సేవ్ నేచర్ సేవ్ లైఫ్, క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే నినాదాలతో భారతదేశ వ్యాప్తంగా జాతీయ జెండాను చేతబట్టి జార్ఖండ్‌కు చెందిన నాగేశ్వర్ సైకిల్ యాత్ర చేపట్టాడు. కర్నూలు నుంచి 340-సి జాతీయ రహదారిపై శ్రీశైలం వెళ్తున్న ఆ యువకుడిని నందికొట్కూరు వద్ద ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ సైకిల్ యాత్రను 2023 డిసెంబరు 9వ తేదీన ప్రారంభించానన్నారు. శ్రీశైలం నుంచి తెలంగాణ మీదుగా పర్యటించి మరో ఐదు నెలల తర్వాత ఈ సైకిల్ యాత్రను తిరిగి జార్ఖండ్‌లోనే ముగిస్తానన్నారు.

నేటి నుంచి టీజీవీ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీనటరాజ నృత్య కళామందిర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నృత్య గురువు ఎస్.కరీముల్లా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీనటరాజ నృత్య కళామందిర్ దశమ వార్షికోత్సవం సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను శుక్రవారం సాయంత్రం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించే గ్రూపు, సోలో నృత్యాల పోటీల్లో విజేతలకు వేర్వేరుగా నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి టి. శారద అన్నారు. గురువారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో, కిశోరి వికాసం కార్యక్రమాన్ని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టి. శారద మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడినా, ప్రోత్సహించినా బాల్య వివాహ నిరోధక చట్టం 2006 సెక్షన్ 9, 10, 11(1) ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పీఓఐసీ పద్మ, శేషమ్మ, ఆంజనే యులు, రాముడు, నాగన్న, షాలుమియా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శారద

భక్తుల మృతి బాధాకరం

• కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి స్వామివారి సన్నిధిలోని వైకుంఠ ద్వారం వద్ద తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం బాధాకరమని, తనను తీవ్ర మనోవేదనకు గురి చేసిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా టీటీడీ మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందన్నారు.

ఆ ఘటన దురదృష్టకరం

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాట ఘటన అత్యంత బాధాకరమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఇతర రాష్ట్రాల నుండి తిరుపతికి వచ్చిన భక్తులు కూడా మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

• జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ

కర్నూలు అర్బన్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటన అత్యంత బాధాకరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పి. మురళికృష్ణ పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం, ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

పల్వరైజర్ మిషన్‌లో పడి మహిళకు తీవ్ర గాయాలు

నంద్యాల క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని గోకుల్‌దాల్ మిల్లులోని పల్వరైజర్ మిషన్‌లో పడి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళ దాల్ మిల్లులో పనిచేస్తూ గురువారం పల్వరైజర్ మిషన్‌లో పడి గాయపడ్డారు. మహిళను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

తుగ్గలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో శివశంకర్ (38) అనే వ్యక్తి గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని జి. ఎర్రగుడిలో ఉంటున్న రామాంజనేయులు కుమారుడు శివశంకర్‌కు వరలక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన శివశంకర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ కేసు నమోదు చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిందితుడికి జైలు, జరిమానా

కర్నూల లీగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగికంగా వేధించిన నిందితుడికి మూడేళ్ల కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు న్యాయధికారి భూపాల్ రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక బుధవారపేటకు చెందిన నిందితుడు బొగ్గుల రాజేష్ 2021 జూన్ నెలలో బాలికను మభ్యపెట్టి అసభ్యకరమైన ఫొటోలు చూపిస్తూ లైంగింకంగా వేధించాడు. దీంతో బాలిక తల్లి 2021 జూన్ 23న కర్నూలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతాప్ రెడ్డి వాదించారు.

పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ

నిందితుడిపై తక్షణమే కేసు నమోదు చేసి విచారణలో కట్టుదిట్టంగా వ్యవహరించి నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ జి.బిందుమాధవ్ అభినందించారు. త్రీటౌన్ ఎస్ఐ రహ్మతుల్లా, మహిళా పీఎస్ ఎస్ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

దిశ వన్ స్టాఫ్ కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూల లీగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిశ వన్ స్టాఫ్ సెంటర్‌ను, మహిళా ప్రాంగణాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించి, సౌకర్యాల గురించి అక్కడ ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో డ్రైనేజీ అపరిశుభ్రతపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరికైనా లీగల్ సర్వీసెస్ చట్టం కింద ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీపీవో శారద, అధికారులు పాల్గొన్నారు.

'108'ని ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్

కర్నూలు హాస్పిటల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని 108 కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని సీఐటీయూ ఆఫీసులో గురువారం ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో 108 ఉద్యోగు లకు వెయిటేజ్ మార్కులు వంటి ప్రయోజనాలు అందించారని ముఖ్య మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం లేకుండా బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో 108 ఈయూ ఉమ్మడి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాస్, కోశాధికారి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ నరసింహారావు, కర్నూలు, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మమ్మల్ని అడిగేదెవరు..?

- అక్రమ సంపాదనే ధ్యేయంగా తెలుగు తమ్ముళ్లు
- పోలీసులు, రెవెన్యూ సిబ్బంది తమ మాట వినాల్సిందేనని ఒత్తిడి
- జీఆర్పీ రిజర్వాయర్‌లో గ్రావెల్‌ను తవ్వేస్తున్న అక్రమార్కులు
- రిజర్వాయర్ కట్టకు పొంచి ఉన్న ప్రమాదం



జీఆర్పీ రిజర్వాయర్‌లో ఎక్స్‌కవేటర్‌తో యథేచ్ఛగా తవ్వకాలు



ఎక్స్‌కవేటర్‌ను తరలించేందుకు వచ్చిన పోలీసులు

మంత్రాలయం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాల మధ్య ఉన్న గురు రాఘవేంద్ర, బసలదొడ్డి రిజర్వాయరులో తెలుగు తమ్ముళ్ల అక్రమ దందా కొనసాగుతున్నది.

రోజుకు 30 ట్రాక్టర్లు..

రోజుకు 30 ట్రాక్టర్ల గ్రావెల్ కొల్లగొడు తున్నారు. ట్రాక్టరు రూ.2వేల చొప్పున తరలిస్తూ అక్రమార్జన చేస్తూ రూ.లక్షలు దండుకుంటు న్నారు. అంతా మాయిష్టం.. పోలీసులు, రెవెన్యూ అధికారులు మేము చెప్పింది వినాల్సిందే.. అంటూ తెలుగు తమ్ముళ్లు మరీ రెచ్చిపోయి నిత్యం తవ్వకాలు చేస్తున్నారు. తవ్వేకొద్ది డబ్బులు అన్నట్లు తెలుగు తమ్ముళ్లు పోటాపోటీగా ట్రాక్టర్లతో తరలిస్తూ రిజర్వాయరు పంప్‌హౌస్‌కు ప్రమాదకరంగా



ప్రమాదకరంగా రిజర్వాయర్ కట్ట

నెలకొంది. గురువారం సాయంత్రం సుంకేశ్వరి గ్రామానికి చెందిన దాదాపు 20 ట్రాక్టర్లకు పైగా ప్రొక్లెయిన్ సాయంతో గ్రావెల్‌ను తరలించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవి, మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీజ్ చేస్తామని తెలిపారు. అయినా తెలుగు తమ్ముళ్లు అంతా తమ ఇష్టం అంటూ, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌లను ఎట్లా తీసికెళతారని ఎదురు దాడికి దిగారు. ఇప్పటికే రిజర్వాయరులో భారీ గుంతలు తవ్వడంతో రిజర్వాయరుకు ఉన్న రాతికట్ట కుంగే ప్రమాదం ముంచుకు వచ్చింది. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇక్కడి పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం జంకుతున్నారు. ఎవరికైనా చెప్పుకోండి.. మమ్మల్ని ఏమీ చేయ లేరన్న ధీమాతో తెలుగుతమ్ముళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తెలుగు తమ్ముళ్లకు అడ్డుకట్ట వేయకపోతే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.

అక్రమంగా గరుసు తవ్వితే చర్యలు



మంత్రాలయం మండలంలోని గురు రాఘవేంద్ర బసలదొడ్డి రిజర్వాయర్‌లో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటాం. జీఆర్‌పీ రిజర్వాయరులో పెద్దగా గుంతలు తవ్వడంతో రిజర్వాయర్ కట్టకు ప్రమాదం ముంచుకు రావచ్చు. ఇలాంటి వాటికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎస్. రవి, తహసీల్దార్, మంత్రాలయం

లైంగిక దాడులను అరికట్టడమే లక్ష్యం

• ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరించిన కర్నూలు ఎస్పీ బిందుమాధవ్



సీడీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలనే ధ్యేయంతో ముందుకెళ్తున్నామని ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. కర్నూలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆడియో, వీడియో సీడీని ఆయన ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ చాలా చోట్ల చిన్న పిల్లలపై లైంగిక దాడులు జరుగుతున్నాయన్నారు. పసిపిల్లలు బ్యాడ్ టచ్ జరిగినప్పుడు సమాజానికి భయపడి తల్లిదండ్రులకు చెబితే వారు తిడుతారేమో అని చదువు మానిపిస్తారేమోనని భయపడకుండా డయల్ 100కు గానీ, డయల్ 112కు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. 5 నిమిషాల వీడియో ద్వారా చిన్న పిల్లలకు అవగాహన కల్పించేందుకు కర్నూలు పోలీసులు చర్యలు చేపట్టారన్నారు. పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు కృషి చేసిన కోడుమూరు సీఐ తబ్రేజ్, సంగీత దర్శకుడు ఫయూమ్, గాయకుడు కరీముల్లా, డ్యాన్సర్లు, నటీనటులు, పోలీసులు, విద్యార్థులను ఎస్పీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ డీడీపై క్రమశిక్షణ చర్యలు

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గతంలో కర్నూలు, ఆదోనిలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడిగా పని చేసినప్పుడు రూ.35.88 లక్షల ప్రభుత్వ నిధుల్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణపై ప్రస్తుతం ఎమ్మిగనూరులో ఉప సంచాలకుడిగా పనిచేస్తున్న వి.రామునాయక్‌పై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. 2013-14, 2014-15లో టమాటా రైతులకు అందాల్సిన రాయితీ సొమ్మును, విద్యుత్ పరికరాల కొనుగోలు పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారనే విజిలెన్స్, ఆడిట్ నివేదికల ఆధారంగా ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బోగస్ మస్టర్‌లు నమోదు చేస్తే చర్యలు

క్రిష్ణగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బోగస్ మస్టర్‌లు నమోదు చేస్తే అధికారులపై చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. గురువారం ఉపాధి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు 300 వేతనం అందేలా చూడాలని అలాగే బోగస్ మస్టర్‌లపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఉపాధిలో అవకతవకలు జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ వెంట ఎంపీడీవో మోహన్ కుమార్, ఏపీవో నాగ సులోచన, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

పంచాయితీలు చేసి రూ. కోట్లు కొట్టేశారు

• ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డిపై ఎమ్మెల్యే పార్థసారథి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని, జనవరి9 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల మధ్య చిచ్చుపెట్టి పంచాయితీలు చేసి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.వందల కోట్లు కొట్టేశారని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 321ఏలో 6.51 ఎకరాలను స్థానికేతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసిన కేసులో చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పరారీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, నిందితుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్ తెలిసిన వెంటే దాన్ని రద్దు చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 2021లో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ హాజీమియా అవుకులో పని చేసేటప్పుడు అక్కడ కూడా ఇలాగే సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ఎవరు తప్పు చేసినా ఊరుకోనన్నారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, శ్రీకాంత్ రెడ్డి, ఫక్రుద్దీన్ ఉన్నారు.

గొర్రెల దొంగతనంపై కేసు నమోదు

ఆదోని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం అంగసకల్లు గ్రామానికి చెందిన గిలక హనుమంతు తన గొర్రెలు పది దొంగతనానికి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. హనుమంతు డిసెంబరు 31న ఆదోని పొలిమేరలో గొర్రెలు మేపుతుండగా క్రాంతినగర్‌కు చెందిన డి.వీరేష్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే ఉదయం జనవరి ఒకటో తేదీన పరిశీలించగా పది గొర్రెలు కనిపించలేదు. బాధితుడు గిలక హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదోని టూ టౌన్ ఎస్ఐ రామనాథ్ తెలిపారు.

కందుల కళ..



కల్లంలో ఆరబోసిన కందులు

పత్తికొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంట కోత చేపట్టారు. పత్తికొండ మండలలో 4,130 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామంలో 473 ఎకరాల్లో కంది పంటను వేశారు. రైతులు పొలంలోనే దిగుడిని తూర్పారపట్టారు. మరికొందరు రైతులు అప్పటికే తూర్పారబట్టిన కందులను ఆరబెట్టుకున్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని
కడపలోనే కొనసాగించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ ఈ. నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం సెవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ అధ్వర్యంలో వివిధ ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు జిల్లా పరిషత్ గాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కమిటీ కన్వీనర్లు జంధ్యాల రఘుబాబు, ప్రసాద్‌శర్మ, ఏపీజీబీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరెడ్డి పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం అమరావతికి తరలింపు ధర్మం కాద న్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, అధికారుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు రియాజ్, రాయలసీమ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు భాస్కర్‌రెడ్డి, బీఎస్ ఎన్ఎల్ యూనియన్ రామరాజు, ఏబీఈఏ నాయకులు ఎల్లయ్య, రోజారమణి, శివప్రసాద్, ఎల్ఐసీ యూనియన్ నాయకుడు సునీయ కుమార్, ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న మహేష్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింద న్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు వెళ్లనీయకుండా ఫీజు బకాయిలు పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు మధు, వేదప్రకాష్, రవి పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

కర్నూలు హాస్పిటల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ జి.మల్లికార్జున రెడ్డి అన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ నెంబరు 36లో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సందర్భంగా కర్నూలు డివిజన్ పరిధిలో ఉన్న పీహెచ్‌సీ ఎన్ఎల్ఈడీ నోడల్ అధికారుల శిక్షణలో ఆయన పాల్గొన్నారు. చర్మం మీద రాగి రంగు, స్పర్శలేని మచ్చలు, నరాల వాపు, కాళ్ల చేతులు తిమ్మిరిగా ఉంటే కుష్ఠు వ్యాధి కావచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీర్లు ఇంటింటా తిరిగి కుటుంబ సభ్యులు అందరికీ పరీక్షలు చేసి కుష్ఠు వ్యాధి నిర్ధారిస్తారన్నారు. కార్యక్రమంలో వార్డు మెడికల్ ఆఫీసర్ డా.రామశిరిషా రెడ్డి, డీపీఎంవోలు విజయ ప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయండి

కర్నూలు అర్బన్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప పిలుపునిచ్చారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, టీఎస్ఎఫ్ నాయకులు రాము, శివ పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీదేవీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్తర (వైకుంఠ) ద్వారం దర్శనం భక్తులకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే లలితా పీఠంలో ఉదయం 10 గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం శ్రీదేవీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా సీపీఐ శత జయంతి ఉత్సవాలు

కల్లూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ఉత్సవాలు రాజీవ్ గృహకల్పలో ఘనంగా నిర్వహించారు. గురువారం రామాంజ నేయులు అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు లలితమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. జగన్నాథం హాజరై కేక్‌కట్ చేసిన అనంతరం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

నేడు ఎస్టీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంక్రాం తి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా కార్యదర్శి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- దుర్వినియోగమవుతున్న నిధులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా పాఠశాల భవనాలు

ఓర్వకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. ఈ ప్రాంతమంతా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలే దర్శనం ఇస్తున్నాయి. అయితే.. వాటిపై అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగమేనని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెండు గదులు, సహకార పరపతి సంఘం హెల్త్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారాయి. ఈ భవనాలు మరమ్మతులు చేపడితే.. ఏదో ఒక దానికి ఉపయోగపడుతాయని గ్రామస్థులు అంటున్నారు. ఈ కార్యాలయాలకు ఉన్న కిటికీలు, డోర్లు, కొందరు వ్యక్తులు తీసుకెళ్లినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు కనీసం వీటిపై దృష్టి కేంద్రీకరించి మరమ్మతులు చేపడుతే ఉపయోగంలోకి వస్తాయనీ గ్రామస్థులు చెబుతున్నారు. ఐదు భవనాలు నిరుపయోగంగా ఉన్నప్పటికీ కొత్త భవనాలు నిర్మించడం సబబు కాదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ప్రజాధనం దుర్వినియోగమే



పాఠశాల ప్రాంగణంలో ఐదు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం దుర్వినియోగమే. వీటిపై అధికారులు స్పందించకపోవడం బాధాకరం.

- గధకారి శేఖర్, హుశేనాపురం

భవనాలకు మరమ్మతులు చేపట్టండి



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు చేస్తే ఉపయోగంలోకి వస్తాయి. రూ. 60 లక్షలకు పైగా నిర్మించారే గానీ, మరమ్మతులు చేయకపోవడం సరికాదు.

- గొల్ల నాగరాజు, హుశేనాపురం

ఉపయోగంలోకి తీసుకురావాలి



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు ఉపయోగంలోకి తీసుకురావాలి. మరమ్మతులు చేస్తే భవనాలు సుందరవనంగా ఉంటాయి. అధికారులు స్పందించి మరమ్మతులను తక్షణమే చేపట్టాలి.

- బజారు, హుశేనాపురం

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు 2025-26 విద్యాసంవత్సరానికి గానూ కర్నూలు నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో ఆరో తరగతిలో అన్ని సీట్లకు, ఏడో తరగ తిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయ లక్ష్మి గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ప్రారంభతేది జనవరి 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖా స్తులు పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్ దర ఖాస్తు ఫారంతో జత పరిచి సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్షలో కనీస మార్కులు 40 మార్కులు అని, ఎస్టీలకు 35 మార్కులు, మెరిట్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివిన విద్యార్థులకు 5 మార్కులు అదనంగా కేటాయిస్తామని హెచ్ఎం వివరించారు.

కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గ్రేడ్-1గా ప్రకటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పాఠశాలలను చూసుకునే బాధ్యతలు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లకు కేటాయిస్తున్నందున వారిని గ్రేడ్-1 హెడ్‌మాస్టర్లుగా మార్పులు చేయాలని ఆ పాఠశాలలో గ్రేడ్-2 హెడ్ మాస్టర్ పోస్టును ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి తెలిపారు. గురువారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్ర మంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు బాబురావు, సుదర్శనం, ఆదినారాయణ రెడ్డి, రమణయ్య, నాగేశ్వరయ్య, శ్రీను, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

కర్నూలు రూరల్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి గురువారం తనిఖీ చేశారు. 2023-24 సంవత్సరం వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయాన్ని సందర్శించినట్లు ఎంపీడీవో రఘునాథ్ తెలిపారు. అనంతరం కార్యాలయం రికార్డుల నిర్వహణ గురించి మండల పరి షత్తు సిబ్బందికి వివిధ సూచనలు తెలియజేశారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీలలో చేతి పంపుల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు గ్రామ పంచాయతీ, మండల కార్యాలయం లోను సిబ్బంది ఫోన్ నెంబర్లు పొందు పరచాలని ఆయన ఎంపీడీవోకు ఆదేశించారు. జడ్పీ సీఈవో వెంట కార్యాలయ పరిపాలన అధికారి జీవీ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గ్రామాలకు నీరు అందించండి: జడ్పీ సీఈవో

ఓర్వకల్లు: కాల్వబుగ్గ సీపీడబ్ల్యూ స్కీం నీటిని గ్రామాలకు అందించాలని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ సీపీడబ్ల్యూ స్కీంను ఆయన తనిఖీ చేశారు. ఈ స్కీం ద్వారా నీరు సరఫరా అవుతున్న కాల్వ, సోమయాజులపల్లె, ఓర్వకల్లు, హుశేనాపురం, తిప్పాయపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశం నిర్వహిం చారు. వీటి నాణ్యత ప్రమాణాలపై అధికారులతో చర్చించారు. అనం తరం ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రెండేళ్ల చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివా సులు, ఏఈ లోకేశ్వరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కేవీ సుబ్బారెడ్డి'లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బీవీ రమణ, ఫ్యాకల్టీలు

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో గురువారం తిరుపతికి చెందిన ఏజీఎస్ సంస్థకు చెందిన హెల్త్ మేనేజర్ రాజేశ్ అయ్యర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ పి.సందీప్‌లతో పాటూ ఇతర ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. మొత్తం 72 మంది విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి, 35 మం దిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కష న్‌లలో ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నామని చెప్పారు. ఇందువల్ల విద్యార్థు లు చదువు పూర్తి చేసుకునేలోగా ఉద్యోగావకాశాలు పొందుతున్నారని అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాం డెంట్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్‌డీ నిజాముద్దీన్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ కుసుమకుమారి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని జీవో జారీ చేసిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి వడ్డెర సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. గురువారం నాగేంద్రనగర్‌లోని వడ్డెర కమ్యూని టీ హాల్‌లో సంఘ పెద్దలు గుంజా వెంకటస్వామి, మక్కల శ్రీని వాసులు, వడ్డె వెంకటయ్య ఆధ్వర్యంలో ఓబన్న, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వడ్డెరుల ఆరాధ్యదైవం వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేలా సర్క్యులర్ జారీ చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మిఠాయిలు పంచుకుని వడ్డెర సంఘాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డి.పుల్లయ్య, జీవీ చంద్రికమ్మ, వెంకటకృష్ణ, జానకిరాముడు, అయ్యన్న పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలి

కోడుమూరు రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలని లీడ్ బ్యాంకు జిల్లా మేనే జర్ రామచంద్రరావు కోరారు. మండలంలోని ఎర్రదొడ్డి, గోరంట్ల, ప్యాలకుర్తి, కోడుమూరు గ్రామాల్లో కౌలు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులపై సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఈవో బాలక్రిష్ణ, వీఆర్వోలు, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య అన్నారు. గురువారం స్థానిక మాధవీనగర్ గౌరు నివాసంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యేలు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఫోరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారని అన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడు తూ గత వైసీపీ ప్రభుత్వ ఒక్క ఉద్యోగం భర్తీ చేయకుండా నిరుద్యో గులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం యువ తకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుం టుందని అన్నారు. నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 6,500 పోలీసు ఉద్యోగాల భర్తీకి సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారని, సంక్రాంతి తర్వాత కూటమి ప్రభు త్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుందన్నారు. కార్యక్ర మంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాం జనేయులు, రాష్ట్ర తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, ఏపీ నిరుద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు బి.శ్రీరా ములు, నవ్యాంధ్ర జేఏసీ అధ్యక్షుడు అయ్యాస్వామి, నరసింహారాజు, రాజన్న, నాగరాజు, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

తిరుపతి ఘటన బాధాకరం: టీడీపీ



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల క్యూ కాంప్లెక్స్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ వ్యక్తం చేశారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా జరిగిన ఘటన అందరినీ కలిచి వేసిందని, సీఎం చంద్రబాబు మంత్రులను అక్కడికి పంపి బాధిత కుటుంబాలకు మెరుగైన శిక్షణ సహాయక చర్యలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, వలసల రామకృష్ణుడు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, మంచాలకట్ట భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: తిరుపతి విష్ణు నివాసం టికెట్ల కౌంటర్ వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తున్నామన్నారు.

సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి

కోడుమూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో ప్రైవేటు విద్యా సంస్థలు క్లాసులు నిర్వహిస్తే విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు వీరేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థలు క్లాసులు నిర్వహించకూడదని, క్లాసుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తే సహించేదు లేదని అన్నారు. నాయకులు అల్తాఫ్, రాజీవ్, మునిస్వామి, రంజిత్, హనుమంతు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఆహ్వానం

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శుక్రవారం నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి వేడుకలు, ఈనెల 30 నుంచి ప్రారంభిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబుకు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆహ్వానపత్రం అందజేశారు. అలాగే క్షేత్ర సమీపంలో పారిశుధ్య పనులుచేపట్టాలని ఆయన వినతిపత్రం అందజేశారు.

ముక్కోటి ఏకాదశికి ఆలయాల ముస్తాబు

ఓర్వకల్లు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఉయ్యాల వాడ కొండపై వెలసిన వెంకటేశ్వరస్వామి, కాల్వ గ్రామంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా ధనుర్మాస 'రేపల్లె' వేడుకలు



శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగర శివారు మామిదాలపాడులోని గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం రేపల్లె వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోదాదేవి తన పాశురాల్లో తెలియజేసినట్లుగా శ్రీకృష్ణ భగవానుడు గోకులం వేంచేయుట, రేపల్లెలో శ్రీకృష్ణుని లీలా విశేషాలను తెలియజేసే పూజాదికాలను నిర్వహించారు. రాత్రి శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని తలపై పెట్టుకొని, మహిళా భక్తులు ముందు కోలాట నృత్యాలు, భజనలు చేస్తుండగా, మంగళవాయిద్యాలతో స్వామిని ఆహ్వానం పలికి గోకులంలోని మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఊంజల సేవ చేపట్టారు. కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల కోసం పోరాటం: సీపీఐ

కల్లూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల కోసం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. గురువారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఐ నగర కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని ధర్నా చేశారు. ఈసందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామన్నా కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కల్లూరు తహసీల్దారు కె.అంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, నాగరాజు, సోమన్న, మల్లన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గూడూరు: పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. గురువారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో ఇళ్ల స్థలాల ప్రచారం భాగంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ఆందోళనకు పెద్ద ఎత్తున తరలిరావా లని పిలుపునిచ్చారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి కృష్ణ, కోడుమూరు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శేషు కుమార్, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పతకాలు సాధిస్తే నజరానా అందజేస్తా

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాసాలో ఈనెల 11 నుంచి 12 వరకు జరగబోయే 41వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజేత లుగా నిలిచి పతకాలు సాధిస్తే నజరానా అందజేస్తానని క్రీడా దాత, న్యాయవాది శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కొండుపోగు చిన్న సుంకన్న, అవినాష్ శెట్టి, శిక్షకుడు మహేశ్వరరావు, వాలీబాల్ సురేష్, గోకారి, రవి, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 9: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను వినియోగించు కోవాలని టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్ అన్నారు. గురువారం గూడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు అవసరమైన ప్లేట్లను టీడీపీ కౌన్సిలర్ రేమట సురేష్ స్వచ్ఛందంగా అందజేశారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ తిమ్మయ్య, ప్రిన్సిపాల్ రమణ, మాజీ వైస్ ఛైర్మన్ కురుకుంద రామాంజనేయులు, బోజుగు సృజన్, రేమట వెంకటేశ్వర్లు విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అందిస్తుందన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పి.రామాంజనేయులు, సింగనగేరి నాయుడు, విజయ్ కుమార్, వీర కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

సి.బెళగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని రైతులు, విద్యార్థులు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం గత పదిరోజుల నుంచి రెగ్యులర్ తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో పెండింగ్‌లో ఉన్నవి ఆయా సమస్యల పరిష్కారం నిమిత్తం డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తంను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించామన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో



ఆలూరు మండలం అరికేర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3 భవనం పనులు ఐదేళ్లుగా నిలిచిపోయాయి. దీంతో అద్దె భవనంలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ వసతి సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. 30మంది పిల్లలు ఉండటంతో వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. - ఆలూరు రూరల్



మద్దికెర గ్రామం కవిరెడ్డి వీదిలో ఉన్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు నడిచే దారి లేదు. చుట్టూ ముళ్లకంప, పిచ్చిమొక్కల మధ్య ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రూ.18లక్షలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రహరీ లేకపోవడం, చుట్టూ పిచ్చి మొక్కలు ఉండటంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. విష సర్పాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. - మద్దికెర,

తిరుమల ఘటన బాధాకరం: ఎమ్మెల్యే

పత్తికొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘటన బాధాకరమని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. తొక్కిసలాటలో 6గురు భక్తులు మృతిచెందడం బాధాకరమని, ప్రభుత్వం రూ.25లక్షల పరిహారం ఇచ్చిందన్నారు. క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తుగ్గలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి బిల్లులు మంజూరు చేయాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు నబీ రసూల్, కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ గత నెలలో సచివాలయాల్లో దరఖాస్తు చేసిన ఇంతవరకు స్థలాలు మంజూరు చేయలేదన్నారు. శుక్రవారం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామన్నారు.

కష్టపడిన వారికే పదవులు

- టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్



జీవన్ కుమార్‌ను సన్మానిస్తున్న వైకుంఠం శివప్రసాద్ జ్యోతి

ఆలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు వస్తాయని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి అన్నారు. బీఎస్ఎన్ఎల్ జిల్లా టీఏసీ సభ్యుడిగా ఎన్నికైన బత్తిని జీవన్ కుమార్ (చిట్టిబాబు)ను గురువారం ఆలూరులో సన్మానించారు. అనంతరం జీవన్ కుమార్ తనకు అవకాశం కలించిన సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నాయకులు వైకుంఠం శివప్రసాద్, జ్యోతి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణ, బిల్లేకల్ వెంకటేష్, మల్లి, సీనప్ప, ప్రకాశ్, గోవింద్, రెహమాన్ పాల్గొన్నారు.

ఆరుగురి మృతి బాధాకరం

ఆదోని టౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట కారణంగా ఆరుగురు మృతి చెందడం బాధాకరమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైఫల్యంపై విచారణ చేసి, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రిలో గర్భిణిలకు భోజనం



గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో గర్భిణులకు గురువారం భోజన వసతి కల్పించారు. దీన్ని ప్రారంభిస్తూ ఆర్డీవో భరత్‌నాయక్ ఇది మంచి కార్యక్రమమని అన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సొంత ఖర్చులతో ప్రతి నెలా గర్భిణులకు ప్రభుతాసుపత్రిలో నిర్వహిస్తున్న బోజనంలో ఆర్డీవో భోజనాన్ని వడ్డించారు. సూపరింటెండెంట్ కల్పన, తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోక్‌నాథ్ పాల్గొన్నారు.

రీ సర్వేకు పచ్చరపల్లి గ్రామం ఎంపిక

హాలహర్వి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చరపల్లి గ్రామాన్ని రీసర్వే కింద ఎంపిక చేశామని తహసీల్దార్ నజీమ బాను అన్నారు. గురువారం మాట్లాడుతూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని రైతులకు మేలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

డ్వామా పీడీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

వెల్దుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): డ్వామా పీడీ వెంకట రమణయ్య వెల్దుర్తిలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. కూలీ రూ.300 పడేలా పనులు కల్పించాలన్నారు. సిబ్బంది రెహమాన్, ఖాసిం ఉన్నారు.

కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

వెల్దుర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రత్నపల్లె సమీపంలో ఆత్మహత్యకు పాల్పడిన ఇటుకల బట్టీ కార్మికుడు దూర్జన్ బెహరా కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. ఇటుక బట్టీల్లో అరకొర వసతులు, చాలీచాలనీ వేతనాలతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు ఆమోదంతోనే ఆన్‌లైన్ చేస్తాం



పెరవలి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే చేసిన అనంతరం రైతుల ఆమోదంతోనే ఆన్‌లైన్ చేస్తామని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. గురువారం మండలంలోని పెరవలి గ్రామంలో రీసర్వే అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజు 20 ఎకరాలు సర్వే చేస్తామని, సవరణలను రైతుల అంగీకారంతోనే ఆన్‌లైన్ చేస్తామన్నారు. పెరవలి గ్రామంలో ఈ నెల 10న గ్రామసభ నిర్వహిస్తున్నామని, బురుజుల, హంపా, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో రీసర్వే గతంలోనే చేశారన్నారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో బాలవర్దన్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, అధికారులు ఉన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



రాస్తా రోకో చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ

ఆలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత దళితుల ఆశాజ్యోతి డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. అమిత్ షా డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. అంబేడ్కర్‌ను ప్రపంచ దేశాలు విగ్రహాలు పెట్టి గౌరవిస్తుంటే ఇలా మాట్లాడటం సరికాదని, వెంటనే ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. పార్టీ ఆలూరు, చిప్పగిరి మండలాల అధ్యక్షులు మొలగవల్లి రామాంజినేయులు, దేగులపాడు మంజునాథ్, కరెంటు గోవిందు, సీనియర్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, మీసాల గోవిందప్ప, వరకుమార్, తిమ్మప్ప, నవీన్, వెంకటేష్, ఖాదర్ పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

వెల్దుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరుకులపాడు, మల్లెపల్లె, వెల్దుర్తి గ్రామాల్లో గురువారం ఎంపీడీవో సుహాసినమ్మ పింఛన్లను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పింఛన్లు తీసుకుంటున్న లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేశారు. అనర్హులకు హెల్త్ పింఛన్లు ఇస్తున్నట్లు ఫిర్యాదుల మేరకు తనిఖీ నిర్వహించారు. పంచాయతీ ఈవో లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

హాలహర్వి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాలని ఎంపీడీవో వరలక్ష్మి పిలుపు నిచ్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సరిహద్దుల్లోని గ్రామాల్లో మూడనమ్మకాలు, నిరక్షరాస్యత కారణంగా చిన్నారులకు వివాహాలు చేస్తున్నారని బాలికల్లో విద్య, ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావాలని కోరారు. వైద్యాధికారి తిమ్మన్న, సూపర్‌వైజర్లు చందన, చంద్రవతి, ఎంఈవో ఈరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలి

దేవనకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో గౌరీదేవి, ఎంఈవో నిర్మల పిలుపు నిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సునీత, సిహెచ్‌వో బాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ధర్నాను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల మంజూరుకు పత్తికొండలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిచనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి రాజా సాహెబ్ పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలోని కుమ్మరివీధి, మడ్డిగేరి, కటికవీధి, ఎస్సీ కాలనీల్లో సీపీఐ నాయకులు ప్రజలను కోరారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు



విద్యార్థినులకు బహుమతులు ఇస్తున్న హెచ్ఎం సుజాత

ఆలూరు రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం సుజాత, యూటీఎఫ్ కార్యదర్శి రూపలత, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షైన, ఉపాధ్యాయులు శైలజ, అరుణ, కళావతి పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి

ఆదోని టౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల ప్రజలు, ఏఎన్ఎంలో, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ అనిల్ సాగర్ సూచించారు. గురువారం పట్టణంలోని హనుమాన్ నగర్, శంకర్ నగర్ ప్రాంతాల ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లకు గురువారం వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

హైందవ శంఖారావం విజయవంతం

ఆదోని టౌన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావాన్ని విజయవంతం చేసిన వారికి వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాయకులు ప్రతాప్, విట్టా రమేష్, కొంగే పంపాపతి, కలురాం పురోహిత్, మరియాని చెన్న బసప్ప పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

దేవనకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రూ.300లు వచ్చేలా చూడాలని ఏపీడీ సీబీ కృష్ణమోహన్, పత్తికొండ ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. గురువారం సీఎల్ఆర్సీ భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో క్షుద్ర పూజల వ్యక్తి?

ఆదోని, జనవరి9 (ఆంధ్రజ్యోతి): పట్టంలోని ఓ ఇంట్లో క్షుద్రపూజలు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టణానికి చెందిన ఓ యువతి ఓ అబ్బాయిని ప్రేమించింది. తల్లిదండ్రులు ఎలాగైనా వారిద్దరిని విడగొట్టాలన్న ఉద్దేశంతో పూజారిని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఇంట్లో క్షుద్రపూజలు చేస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు స్వామిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

12న ముగ్గుల పోటీలు

పత్తికొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 12న ఉదయం శ్రీరామ హాస్పిటల్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఎండీ నీలకంఠ తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5,016, చీర, రెండో బహుమతి రూ.3,016, మూడో బహుమతి రూ.2,016 ఇస్తామన్నారు. వివరాలకు 9885713005. 9885467692 నెంబర్లను సంప్రదిం చాలని కోరారు.

ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలి: ఎంపీపీ

ఆలూరు, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీల భర్తీకి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రంగమ్మ కోరారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన 'ఎంపీడీవో కావలెను ' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఎంపీడీవో సీటు ఖాళీగా ఉంటే పాలన ఎలా సాగుతుందన్నారు. పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించాలన్నారు. తాను ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

హద్దులు ఏర్పాటు చేస్తాం

మద్దికెర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాలు ఆక్రమించకుండా స్థలాలకు హద్దులు ఏర్పాటు చేస్తామని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి గురువారం అన్నారు. ఈ నెల 5వ తేదీన 'దర్జాగా కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆయన కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టామని, హద్దులు ఏర్పాటు చేయాలని కార్యదర్శి శివకుమార్‌ను ఆదేశించామన్నారు.

సీడీపీవోగా బాలమణి

ఆలూరు, జనవరి9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారిగా కేవీ బాలమణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మద్దమ్మ కర్నూలుకు బదిలీపై వెళ్ళడంతో కర్నూలులో ఎసీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న కేవీ బాలమణిని ఎఫ్ఎసీడీపీవోగా నియమించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని, గర్భిణులు బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తామన్నారు

రైతులు సహకరించాలి

తుగ్గలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. గురువారం పగిడిరాయిలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. రెండో విడత రీసర్వే కింద పగిడిరాయి ఎన్నికైందన్నారు. డీటీ నాగరాజు ఉన్నారు.

థియేటర్ల వద్ద గుంపును తగ్గించాలి

- సంక్రాంతి సినిమాలకు మార్గదర్శకాలు జారీ
- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



ఆదోని, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): థియేటర్ల వద్ద ప్రేక్షకులు గుంపులుగా ఉండకూడా యజమానులు చూసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం మాట్లాడుతూ సినిమా ఆటోగ్రఫీ చట్ట ప్రకారం ప్రభుత్వం సూచనలు జారీ చేసిందని తెలిపారు. భారీ సినిమాలు గేమ్ చేంజర్, డాకు మహరాజ్ విడుదల నేపథ్యం లో శాంతి భద్రతలపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌ను ప్రోత్సహించాలని, పరిశుభ్రత పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రేక్షకుల రక్షణకు ప్రణాళికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఫుడ్ కోర్టుల్లో ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలన్నారు. అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలి



డీఈవో శామ్యూల్ పాల్‌ను సన్మానిస్తున్న వెంకప్ప

ఆలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చూడాలని జనసేన ఆలూరు ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప కోరారు. గురు వారం డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను కర్నూ లులో కలిశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య ఇవ్వాలని, నైపుణ్యం పెంచాలని, పాఠ శాలలో రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కేసీ, ఉదయ్ కుమార్, జనసేన నాయకులు సుబ్బయ్య, ఆస్పరి జనసేన మండల అధ్యక్షుడు అరవింద్, దేవనకొండ నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి రామచంద్ర, రాష్ట్ర కోఆర్డినేటర్ అమరేష్ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలో సాంఘిక సంక్షేమ మంత్రి డోల బాల వీరాంజినేయులుచే క్యాలెండర్, డైరీని ఆవిష్కరించినట్లు తెలిపారు.

ఫాతిమా షేక్ సేవలు చిరస్మరణీయం



ఆదోనిలో నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి ముస్లిం ఉపాధ్యాయని ఫాతిమా సేవలు చిరస్మరణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. గురువారం ఫాతిమా షాక్ జయంతి సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నివాళి అర్పించారు. సావిత్రిబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఎంతోమందికి విద్యను అందించారన్నారు. నాయకులు నాగరాజు, శశిధర్, తరుణ్ పాల్గొన్నారు.

పత్తికొండ: దేశంలో మొట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సేవలు మరువలేనివని బాలికోన్నత పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ అన్నారు. 194వ జయంతిని పాఠశాలలో గురువారం నిర్వహించారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రం జారీ చేయడం అన్యాయం

ఆదోని అగ్రికల్చర్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మాదాసీ, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడం అన్యాయమని మాల మహానాడు నాయకుడు, న్యాయవాది చంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. జీవో నెం. 53 ప్రకారం మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయరాదని, జారీ చేస్తే క్రిమినల్ కేసులతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లప్ప, భరత్, విజయ్, చాగ గిరి పాల్గొన్నారు.


టికెట్ల ధరలు పెంచిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొత్త సినిమా టికెట్ ధరలను పెంచిన వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. బెనిఫిట్‌షోకు వేలమంది అభిమానులు వస్తారని, ప్రేక్షకుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని థియేటర్ యాజమానులు ధరలు పెంచారని ఆరోపించారు. ఉచ్చీరప్ప, శ్రీకాంత్, నాగరాజు, అంజి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి



ఆదోని అగ్రికల్చర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షల్లో ఆదోని డివిజన్ పాఠశాల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రణాళిక రూపొందించారా?

జవాబు: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. కనీస మార్కులతో పాసయ్యేలా ప్రణాళిక రూపొందించాం

ప్రశ్న: ఈ ఏడాది ఎంతమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు?

జవాబు: ఆదోని డివిజన్ పరిధిలో 12,150మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న: చాలా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉంది కదా?

జవాబు: ఇది వాస్తవమే. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా కొంతమంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజనం అమలు ఎలా ఉంది?

జవాబు: ప్రభుత్వం సూచిం చిన విధంగా మెనూ ప్రకారం శుచి, శుభ్రతతో భోజనాన్ని వడ్డిస్తున్నాం.

ప్రశ్న: ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: ఎంఈవోలు, నేను ఎప్పటికప్పుడు ప్రైవేటు విద్యాసంస్థలను తనిఖీ చేస్తున్నాం.

క్షణికావేశంలో బలవన్మరణాలు

● చిన్న సమస్యలకే జీవితంపై విరక్తి
● ఏడాది కాలంలో 20కి పైగానే ఆత్మహత్యలు

గోనెగండ్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలో ఇటీవల బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్న పాటి సమస్యలకే జీవితంపై విరక్తి చెందడం ఆత్మహత్య చేసుకుంటున్నారు. మండలంలో గత ఏడాది కాలంలో 20 మందికి పైగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసు రికార్డులు తెలుపుతున్నాయి. అయితే గత 2024 డిసెంబరులోనే నలుగురు రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసు లెక్కల్లోకి రాని ఆత్మహత్యలు కూడా ఉన్నాయి. ఆత్మహత్యలకు పాల్పడిన వారంతా 20 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు ఉన్నావారే అని తెలుస్తోంది. 50 ఏళ్ల పై బడిన వారిలో ఈ ధోరణి ఎక్కువగా ఉన్నట్లు మానసిక వైద్యుల ద్వారా తెలుస్తోంది. సమస్య ఉన్నప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్లే బలవన్మరణాలు జరుగుతున్నాయి. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల కారణంగా కుటుంబ సభ్యుల జీవితాలు వీధిన పడపోతున్నాయని వారు గుర్తించడం లేదు.

మండలంలో డిసెంబరులో జరిగిన ఆత్మహత్యలు :

● గోనెగండ్లకు చెందిన కురువ రంగముని(48)అనే రైతు అప్పుల బాధ తాళలేక డిసెంబరు 13వ తేదీన తన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతు ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

● హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన ఈడిగ విజయ్(20)అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక డిసెంబరు 16వ తేదీన పొలం దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతు ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

● పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బోయ నరసింహుడు (47)అనే కౌలు రైతు అప్పుల బాధ భరించలేక డిసెంబరు 27వ తేదీన గ్రామశివార్లలో గుడిసెలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతు ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



● గోనెగండ్లకు చెందిన రాజు అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటు ఇల్లు కట్టు కున్నాడు. అయితే ఇళ్ల కట్టుకునేందుకు గాను అప్పు చేశాడు. ఆ అప్పు తీర్చలేక డిసెంబరు 19న పురుగు మందు తాగాడు. కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజుకు భార్య సునీతమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబం ఇబ్బందుల పాలు కావాల్సి వచ్చింది. ఈ లాంటి సంఘటనలు కోకొళ్లలు.

ముందుగా గుర్తించాలి: ఆత్మహత్యకు పాల్పడేవారిని ముందుగానే గుర్తించవచ్చునని మానిసిక వైద్యులు తెలుపుతున్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారు కొన్ని అసాధారణ లక్ష్యణాలను కలిగి ఉంటారు. ఒంటరి తనాన్ని కోరుకుంటూ అతిగా మద్యం సేవిస్తుంటారు. ప్రతీకారం తీర్చుకొవడంపైనే ఎక్కువగా మాట్లాడటం చేస్తుంటారు. తీవ్రమానసిక ఒత్తిడికి లోను కావడం ఎక్కువగా నిద్రపోవడం ఉంటుంది. రాత్రి పూట ఎక్కువగా ఆలోచించడం జరుగుతుంది.

కుటుంబ సభ్యులు గమనించాలి: ఆర్థిక ఇబ్బందులని, కుటుంబ సమస్యలని, ప్రేమ విఫలమని, అప్పుల బాధ అని, పరీక్ష తప్పడమని అనారోగ్యకారణమ ఇలా రకరకల కారణాలు ఆత్మహత్యలకు దారి తీస్తాయి. మానసికంగా కుంగిపోతున్న వారిని వారి కుటుంబ సభ్యులు గుర్తించాలి. అలా గుర్తించక పోవడం గుర్తించినా తగు చర్యలు తీసుకోకపోవడం వల్ల అనర్థాలు జరిగిపోతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై, యువతపై తల్లిదండ్రులు బలవంతంగా తమ అభిప్రాయాలను రుద్దడం, ఆత్మహత్యలకు మరో కారణమని నిపుణులు తెలుపుతున్నారు. పరిపక్వతం చెందని వయస్సులో యువత కూడా తప్పుదారి పట్టి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

గుర్తించి ఇలా చేయాలి: ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచరాదు. వీలైనంత వరకు ఇంట్లో ని వారి అందరి మధ్యనే ఉండేవిధంగా చూడాలి. ధైర్యం చెబుతూ ఉండాలి. ఆత్మహత్యకు సహకరించే వస్తువులు వారి దగ్గర లేకుండా చూడాలి. ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింక్ పుస్తకాలు, బిహేవియర్ థేరాపి, కౌన్సెలింగ్ ప్రక్రియలు ఎంతో ఉపయోగపడతాయి. వీలైనంత త్వరగా మానసిక వైద్యులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

చట్టం ఇలా చెబుతుంది: ఆత్మహత్యకు పాల్పడటం, యత్నించడం, ప్రోత్సహించడం చట్టప్రకారం నేరం. ఆత్మహత్య కు యత్నించిన వారిపై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)సెక్షన్ 226 కింద ఆత్మహత్య ప్రోత్సహించే వారిపై సెక్షన్ 108 కింద కేసు నమోదు చేయబడుతుంది.

జీవితం విలువైంది



జీవితం విలువైంది. ప్రశాంతంగా బతకడం నేర్చుకోవాలి. మానవ జీవితం అంటేనే ఎత్తుపల్లాలు, కష్టసుఖాలు ఉంటాయి. వాటిని సమానంగా చూడాలి. దేనికి బెదరరాదు, కుంగరాదు. సమస్యలు వచ్చినప్పుడు ఎదుర్కోవాలి. ప్రతి సమస్యలకు చావే పరిష్కారం కాదు. ఎలాంటి సమస్య ఉన్నప్పటికీ ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా ఆలోచించాలి. పరిష్కారం దొరుకుతుంది.

- గంగాధర్ సీఐ, గోనెగండ్ల

ఆత్మ ధైర్యాన్ని కోల్పోకూడదు



ఎవరే కాని ఆత్మధైర్యాన్ని కోల్పోరాదు. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, మారుతున్న విధానాల కారణంగా యువత, విద్యార్థులు ఆత్మధైర్యాన్ని కోల్పోతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోలేక వారిలో వారే కుంగిపోతున్నారు. అతిగా ఆలోచించకుండా మనో ధైర్యాన్ని కోల్పోకుండా మంచి స్నేహితులతోబాధలు పంచుకోవాలి. లేక పోతే మానిసిక వైద్యులను సంప్రదించాలి. సమస్యలను పరిష్కరించేందుకు మార్గాలను అన్వేషించాలి. ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం చూపదు.

- కార్తీక్, వైద్యాధికారి, గోనెగండ్ల

ఎరువుల లారీ బోల్తా



బోల్తాపడ్డ ఎరువుల లారీ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరాలదొడ్డి క్రాస్ రోడ్డు సమీపంలో ఎరువుల బస్తాలతో వస్తున్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్నూలు వైపు నుంచి ఎమ్మిగనూరు వైపు ఎరువుల బస్తాలతో వస్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కలో ఉన్న చిన్నపాటి కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు. లారీలో ఉన్న ఎరువుల బస్తాలను మరొక లారీలోకి లోడ్‌చేసి లారీని తీసుకెళ్లినట్లు తెలిసింది.

తెలంగాణకు 30 కుటుంబాలు వలస



తెలంగాణకు వెళ్తున్న కూలీలను సాగనంపుతున్న కుటుంబ సభ్యులు

కౌతాళం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళం నుంచి దాదాపు 30పైగా కుటుంబాలు రెండు వాహనాల్లో తెలంగాణకు వలసలు పోయారు. కౌతాళంలోని మాసలగేరి, భైటిగేరి నుంచి కూలీలు వలసలు పోయారు. తల్లిదండ్రులతోపాటు వారి పిల్లలు చదువుకుంటున్న బడిఈడు పిల్లలు కూడా వలస బాట పట్టారు. గ్రామంలో ఇంత వరకు వ్యవసాయ పనుల వల్ల పత్తితీత పనులు ఉండేవని ప్రస్తుతం పనులు తగ్గిపోయాయని కూలీలు చెబుతున్నారు. మిరప కోత పనులు వచ్చే వరకు దాదాపు రెండు నెలలు పనులు ఉండవని కూలీలు రంగమ్మ, క్రిష్ణయ్య, గంగమ్మ, రామాంజనేయులు తెలిపారు. తెలంగాణలో మిరప కోత పనులు మొదలు కావడంతో రెండు నెలల పాటు అక్కడ పనులు చేసుకోవడానికి వెళ్తున్నామని చెప్పారు.

రూ.14 లక్షల విరాళాలు

నందవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింతలో వెలసిన బండేగురుస్వామి ఆలయానికి గురువారం గ్రామస్థులు రూ.14లక్షల విరాళాలు సేకరించారు. ఈ విరాళం డబ్బులు బండే గురుస్వామి ముఖద్వార గోపురం కోసం ఖర్చు పెట్టనున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు బసవరాజుగౌడు, కృష్ణమూర్తి, మాచర్ల బసవన్న, కురవ పెద్దనరసన్న, జంబు మల్లప్పగౌడు, రాముడులు తెలిపారు. ఫిబ్రవరి 23 నుండి మూడు రోజులు పాటు జరిగే బండేగురుస్వామి మహోత్సవ జాతర, పల్లకోత్సవం, రథోత్సవం వైభవంగా జరుపుతున్నట్లు వారు వెల్లడించారు.

30 శాతం ఐఆర్, డీఏ ప్రకటించాలి



మాట్లాడుతున్న వైష్ణవ కరుణానిధి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్, డీఏలను ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైష్ణవ కరుణానిధి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తక్షణమే 30శాతం ఐఆర్‌తో పాటు డీఏలను ప్రకటించకపోతే ఆందోళనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పీఆర్‌టీయూ పని చేస్తుందన్నారు. ఎంఈవో మధుసూదన్‌రాజు, సుదర్శన్‌రెడ్డి, రామాంజ నేయులు, ధనుంజయ, రవిప్రకాష్, రాజు, శంకరప్ప, నాగరాజు, శేఖరప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దకడుబూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రమోషన్లు ఇవ్వాలని ఏపీయూఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హుసేన్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడుబూరులో ఏపీయూఎస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారులు సునీయం మేడమ్, రాంమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేసి అన్ని రకాల ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, వీరారెడ్డి, ప్రాణేష్ ఆచారి, యువరాజు, నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. రాఘవేంద్ర స్వామికి ఇష్టదినం గురువారం కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. శ్రీమఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి పరిమళ ప్రసాదం కొరత రానీయకండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఒక్కో భక్తునికి రెండు ప్యాకెట్లకు పరిమితం చేశారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జిలు, హోటల్‌లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

రమణీయం ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం ధనుర్మాసం దశమి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజ మందిరంలో పీఠాధిపతి మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి మంగళహారతులు ఇచ్చారు. వెండి రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు.



శ్రీమఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

నేడు మంత్రాలయంలో పూజలు బంద్: రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా బృందావనానికి జరిగే పూజలు బంద్ చేస్తారు. నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకునే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసం పాటిస్తారు.

స్టీఫెన్ హాకింగ్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్టీఫెన్ హాకింగ్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం స్టీఫెన్ మిలియం హాకింగ్ జయంతి నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కూడా సృజనాత్మకంగా ఆలోచించాలని అన్నారు. స్టీఫెన్ మిలియం హాకింగ్ స్ఫూర్తిగా శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు బీజీ మాదన్న, రాజశేఖర్ రెడ్డి, రమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

వలంటీర్లను ఎప్పుడు కొనసాగిస్తారు..?

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వలంటీర్లను ఎప్పుడు కొనసాగిస్తారో చెప్పాలని మండల సీఐటీయూ అధ్యక్షులు గోవిందు, కార్యదర్శి రాముడు, ఏపీ గ్రామ వార్డు వలంటీర్ యూనియన్ నాయకులు సురేష్ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగించబోమని చెప్పారని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు చెల్లించి వలంటీర్లను వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక గౌరవ అధ్యక్షుడు సురేష్, అధ్యక్షులు శిరీష, కార్యదర్శి నవీన్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరి, గఫూర్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

బైలుప్పలలో తాగునీటి సమస్య పరిష్కారం



బైలుప్పలో తాగునీటి పైప్ లైన్ వేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలోని తాగునీటి పైపులైన్ వేయడంతో తాగునీటి సమస్య తీరిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బజారి తెలిపారు. మానుకింది వీధిలో పాత పైపులైన్ పగిలిపోయి చాలా కాలమైంది. దీంతో ఆ వీధికి తాగునీరు అందక కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నిధులు విడుదల కావడంతో కొత్త పైపులైన్ వేశామని వారు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



తుంగభద్ర నదిలో అక్రమ ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి

మంత్రాలయం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున ఎమ్మిగనూరుకు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రవి, ఎస్ఐ పరమేష్ నాయక్‌లు తెలిపారు. గురువారం అక్రమ ఇసుక జరుగుతుందన్న సమాచారం రావడంతో పోలీసుల సహాయంతో తహసీల్దార్ రవి నదీతీరంలోకి వెళ్లారు. నదిలో తోడుతున్న ఇసుకను పరిశీలించి అక్కడున్న చెట్నహళ్లికి చెందిన భీమయ్య, సూగూరు గ్రామానికి చెందిన రజాక్, మంచాల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌లు ముగ్గురు ట్రాక్టర్లను సీజ్ చేసి మంత్రాలయం పోలీసులకు అప్పగించారు. అనంతరం అపరాధ రుసుం విధించి వదిలిపెట్టారు. అనుమతులు లేకుండా నదిలోకి వెళ్లి ఇసుకను అక్రమంగా తోడేస్తే ఊరుకునేది లేదని, అలాంటిది అక్రమ ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జిల్లా మైనింగ్ అధికారులకు పంపిస్తామని తెలిపారు.

అలరించిన ముగ్గుల పోటీలు



వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న బాలికలు

ఎమ్మిగనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బారికి చంద్రశేఖర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు పాల్గొని రంగు రంగుల రంగవల్లులను వేసి తమ ప్రతిభను చాటారు. వివిధరకాల రంగవల్లులు వేయటంలో పాఠశాల ఆవరణం కళకళలాడింది. పోటీల్లో విజయం సాధించిన అంజలికి మొదటి బహుమతి, ఐశ్వర్యకు ద్వితీయ, తులసికి తృతీయ, పావనికి నాల్గో, సుహానాకు ఐదో బహుమతులను ట్రస్టు చైర్మన్ బారికి చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది మురళీకృష్ణ, పాఠశాల హెచ్ఎం నాగభూషణం రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో దాత ఈరన్న గౌడ్, షఫీవుల్లా, మాచాని వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖలో పురోగతి లేదు

అధికారులపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బీవీ



అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మన నియోజకవర్గంలో ఉద్యానవన శాఖ చాలా వెనుకబడి పురోగతి కనిపించటం లేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఉద్యానవన శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఉద్యానవన శాఖ ఏఈఓ జగదీష్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉద్యానవన పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయి.. ఏఏ పంటలు సాగయ్యాయంటూ ఆరా తీశారు. ఇందుకు సదరు అధికారి కేవలం ఉల్లి సాగు గురించి మాత్రమే తెలియజేశారు. మిగతా పంటల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో కలిసిన సమయంలో పామాలిన్ పంటను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పామని, ఇప్పటి వరకు ఎందుకు చేయలేదన్నారు. అలాగే నియోజకవర్గంలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుపై దృష్టి సారించాలని చెప్పామని ఇంతవరకు సమాధానం చెప్పలేదని ఎమ్మెల్యే అన్నారు. అంతేగాక రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ యంత్రాలను ఏమేరకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. రైతులతో సమావేశాలు నిర్వహించాలని, తాను కూడా సమావేశానికి వచ్చి రైతులతో మాట్లాడి ఒప్పిస్తామన్నారు. ఏడీఏ మహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ స్థానిక ఉద్యానవన శాఖ అధికారి రాలేదని, అందుబాటులో లేదని జిల్లా అధికారులతో మాట్లాడి మరోసారి కలుస్తామని చెప్పారు. పూర్తి సమాచారం, ప్రణాళికతో రావాలని సమీక్ష నిర్వహిస్తామన్నారు. అనంతరం పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే స్టేట్ బ్యాంకు మేనేజర్, సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి 2025 క్యాలెండర్‌ను అందజేశారు.

పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

రూ. 3 కోట్లతో రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

ఎమ్మిగనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ నుంచి కమిటీ వరకు వేస్తున్న బీటీ రోడ్డును, డివైడర్లను, సెంట్రల్ లైటింగ్‌ను, గోనెగండ్ల రోడ్డులో పూర్తయిన ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. అలాగే సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కావటంతో వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ గంగిరెడ్డి, ఏఈ ప్రసన్నాంజనేయులు, టీడీపీ నాయకులు రామకృష్ణ నాయుడు, కటారి రాజేంద్ర, నవాజ్, వాహీద్, మిన్నప్ప, అమాన్, కామార్తి మహేష్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పండుగగా ప్రకటించడం హర్షణీయం



హర్షం వ్యక్తం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వ పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం హర్షణీయమని వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు బజారప్ప, అధ్యక్షులు గురుస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలితరం స్వాతంత్రోద్యమంలో వడ్డె ఓబన్న పోషించిన వీరోచిత పాత్ర మరచిపోలేనిదన్నారు. అలాంటి తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడి జన్మదినాన్ని ప్రభుత్వం గుర్తించి ఈనెల 11 ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని జీఓ విడుదల చేయటం అభినందనీయమన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఓబన్న జయంతిని ఈ నెల 13న పట్టణంలోని కుర్ణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమన్న, గోవిందరాజులు, చంటి, ఈరేష్, తిమ్మరాజు, ఎల్లప్ప, వెంకటేశ్, భీమన్న, శివరాజు, రవికుమార్, కృష్ణ, రాంబుపాల్ పాల్గొన్నారు.

గ్రామాలకు నీరు అందించండి: జడ్పీ సీఈవో

ఓర్వకల్లు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ సీపీడబ్లూ స్కీం నీటిని గ్రామాలకు అందించాలని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ సీపీడబ్లూ స్కీంను ఆయన తనిఖీ చేశారు. ఈ స్కీం ద్వారా నీరు సరఫరా అవుతున్న కాల్వ, సోమయాజులపల్లె, ఓర్వకల్లు, హుశేనాపురం, తిప్పాయపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశం నిర్వహిం చారు. వీటి నాణ్యత ప్రమాణాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు.